



తల్లాడ : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే సండ్ర, వృద్ధుడిని కలిసి ఓటు అభ్యర్థిస్తున్న సండ్ర వెంకటవీరయ్య.

# కార్యకర్తలా పనిచేశా.. ఆశీర్వదించండి

- **కల్లబొల్లి మాటలు చెప్పే నాయకుల మాటలు నమ్మొద్దు ..**
- **అభివృద్ధిని చూసి ఆదరించండి..**
- **ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే సండ్ర**

తల్లాడ, నవంబర్5: ఎన్నికల అప్పుడు వచ్చిన కనబడి కల్లబొల్లి మాటలు చెప్పే నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. తల్లాడ పట్టణంలోని బుడగజంగాల, మాలపల్లి, ఎన్టీఆర్‌కాలనీ తదితర ప్రాంతాల్లో, ముస్లిం మతపెద్దలతో ఆయన ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మూడు పర్యాయాలు నన్ను గెలిపించి ఆదరించారని, ప్రస్తుత ఎన్నికల్లో సత్తుపల్లి ఎమ్మెల్యేగా నాకు మీ ఆశీర్వాదం అందించాలని, మీరే నా బలం, బలగం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు దొడ్డా శ్రీనివాసరావు, దూపాటి భద్రరాజు, రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దుగ్గిదేవర వెంకట్‌లాల్, బొడ్డు వెంకటేశ్వరరావు, మోదుగు ఆశీర్వాదం, దగ్గుల శ్రీనివాసరెడ్డి, బద్ధం కోటిరెడ్డి, నాయుడు శ్రీనివాసరావు, జీ.వీ.ఆర్, గుండ్ల వెంకటి, వజ్రాల రామిరెడ్డి, యూసూఫ్, చల్లా తిరుమలరావు, చల్లా నాగులు, దూపాటి నరేశ్‌రాజు, కాంపెల్లి రాము, శెట్టిపల్లి లక్ష్మణరావు, బాబు తదితరులు పాల్గొన్నారు.



పెనుబల్లి : మండాలపాడులో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం



సత్తుపల్లి టౌన్ : ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

పెనుబల్లి, నవంబర్ 5: మండలపాడు గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు ఆదివారం ఇంటింటికి తిరుగుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను, మ్యానిఫెస్టోలో సీఎం కేసీఆర్ ప్రకటించిన పథకాలను ప్రజలకు వివరిస్తూ ఓటు అభ్యర్థించారు. కారు గుర్తుపై ఓటు వేసి సండ్ర వెంకటవీరయ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కోట ప్రభాకర్, తేళ్లూరి ఆంజనేయులు, మల్లాది రవి, మధు తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లి టౌన్, నవంబర్ 5 : సత్తుపల్లి పట్టణంలో జరిగిన అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటేయాలని సత్తుపల్లి గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్ అన్నారు. ఆదివారం నిర్వహించిన ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పట్టణంలోని 23, 19 వార్డుల్లో వారు మాట్లాడారు. కారు గుర్తుకు ఓటేసి సండ్రను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రఫీ, మల్లూరు అంకమరాజు, అమరవరపు విజయనిర్మల, రాఘవేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వేంసూరు, నవంబర్ 5: నియోజకవర్గ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య గెలిపించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు వేంసూరులో ఆదివారం ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేశారు. ఎమ్మెల్యే సండ్రను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రామాల మోహన్‌రావు, యాకూబు, జహీర్, చాంద్‌పాషా, కిన్నెర రాము, మారయ్య తదితరులు పాల్గొన్నారు.



వేంసూరు : ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చింతకాని, నవంబర్ 5 : చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలో చింతకాని గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... రామకృష్ణాపురం అడ్డరోడ్డు సమీపంలో ఈ నెల 3వ తేదీ రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డ విషయం తెలిసిందే. తీవ్రంగా గాయపడ్డ చింతకాని గ్రామానికి చెందిన కే వెంకటేశ్వర్లు(27) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. ఎస్సై రాజేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఐదుగురిపై కేసు నమోదు

చింతకాని, నవంబర్ 5 : ఇంటి విషయమై రామకృష్ణాపురం గ్రామంలో అత్తా, కోడళ్ల మధ్య ఆదివారం వివాదం నెలకొన్నది. ఈ వివాదంలో అత్త సీతమ్మ, ఆడబిడ్డలు నాగమ్మ, రంగమ్మలపై కోడలు కొండమ్మతో పాటు మరో నలుగురు కలిసి దాడి చేయగా వారు గాయపడ్డారు. బాధితురాలు సీతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు.

## స్వల్పంగా తగ్గిన పామాయిల్ గెలల ధర

అశ్వారావుపేట, నవంబర్ 5 : పామాయిల్ గెలల ధర స్వల్పంగా తగ్గింది. సెప్టెంబర్ నెల టన్ను గెలల ధర రూ.12,231 ఉండగా అక్టోబర్ నెలకు రూ.35 తగ్గి రూ.12,196లకు చేరింది. ఈ ధర అక్టోబర్ నెలలో ఫ్యాక్టరీలకు తరలించే గెలలకు మాత్రమే వర్తిస్తుందని ఆదివారం ఆయిల్‌ఫెడ్ డివిజనల్ ఆఫీసర్ ఆకుల బాలకృష్ణ తెలిపారు. ఆయిల్ రికవరీ శాతం పెరుగుదలకు పక్వానికి వచ్చిన గెలలను సేకరించాలని, పచ్చి గెలలు వల్ల దాని ప్రభావం ఆయిల్ రికవరీపై పడుతుందని, ఫలితంగా గెలల ధర తగ్గే అవకాశం ఉంటుందని ఆయన వివరించారు. పామాయిల్ గెలల సేకరణలో ఆయిల్‌ఫెడ్ అధికారుల సూచనలు పాటించాలని ఆయన రైతులను కోరారు.



## 192 మద్యం సీసాలు స్వాధీనం

దమ్మపేట, నవంబర్ 5 : కారులో బెల్టుషాపులకు అక్రమంగా తరలిస్తున్న 192 మద్యం సీసాలను దమ్మపేట మండల కేంద్రంలో స్పెషల్ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. మద్యం తరలిస్తున్న వాహనాన్ని పోలీసుస్టేషన్‌కు తరలించి ఎక్సైజ్ పోలీసుల ఎదుట మద్యాన్ని సీజ్ చేశారు. ఎన్నికల నిబంధన అమలులో ఉన్న కారణంగా నిబంధనలకు విరుద్ధంగా బెల్టుషాపులు నిర్వహించి దొంగచాటుగా మద్యం అమ్మినా, అనుమతికి మించిన నగదు బదిలీ చేసినా కఠినచర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.



పట్టుకున్న మద్యం సీసాలతో అధికారులు

## రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు క్రీడాకారుల ఎంపిక

దమ్మపేట, నవంబర్ 5 : 33వ తెలంగాణ రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ పోటీలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా (బాలురు) జట్టు ఎంపికలు పార్కలగండి ప్రభుత్వ గిరిజన ఉన్నత పాఠశాలలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం కె.రాందాస్ అధ్యక్షతన ఆదివారం జరిగాయి. ఈ పోటీలకు 85 మంది విద్యార్థులు హాజరవగా 15 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 15, 16, 17 తేదీల్లో మెదక్ జిల్లా తూంపురంలో జరిగే పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా స్పోర్ట్స్ అధికారి బి.గోపాలరావు, ఎంపికల కమిటీ బాధ్యులు రామారావు, పి.పవన్‌కుమార్, కె.వెంకటేశ్వర్లు, ఎ.కృష్ణ, సమ్మయ్య, ప్రసాద్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులతో నిర్వాహకులు

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వేంసూరు, నవంబర్ 5: వేంసూరు, మర్లపాడు, చౌడారం, ఎర్రగుంటపాడుతో పాటు, పలుగ్రామాల్లో సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ వేంసూరు ఏఈ అంకారావు తెలిపారు. రాయుడుపాలెం సబ్‌స్టేషన్ మరమ్మతులు, 33 కే.వీ.లైన్‌లో చెట్లు తొలగించేందుకు విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

## మహిళ ఆత్మహత్య

సత్తుపల్లి రూరల్, నవంబర్ 5 : ఉరేసుకుని మహిళ మృతిచెందిన సంఘటన పట్టణంలో ఆదివారం చోటుచేసుకున్నది. హెడ్‌కానిస్టేబుల్ చెన్నారావు తెలిపిన వివరాల ప్రకారం .. సత్తుపల్లి అంబేద్కర్‌నగర్‌కు చెందిన బత్తుల అనురాధ (45) భర్త శ్రీనివాసరావు నాలుగేళ్లుగా అనారోగ్యంతోమంచానికే పరిమితమయ్యాడు. అతనికి ఇన్నేళ్లుగా సేవలు చేయడంలో విరక్తి చెంది పుట్టింట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతురాలి తల్లి బిల్లా నాగేశ్వరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.